ప్రజాశక్తి

బుధవారం 8 నవంబర్ 2023 5 విజయనగరం



శాస్త్రీయ దృక్పథంపై జెవివి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శాస్త్రీయ దృక్పథంపై ప్రచారంలో భాగంగా స్థానిక సెంచూరియన్ యూనివర్సిటీలో యువతకు జెవివి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. దేశంలో సైన్స్ రంగంలో ప్రథమ నోబెల్ బహుమతి పొందిన సివిరామన్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన ఎలా రూపొందించుకోవాలి, అది లేకుంటే ఉండే నష్టాలపై జెవివి ప్రధాన కార్యదర్శి ప్రభాత్ వివరించారు. జెవివి చేసిన కృషిని అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట రావు వివరించారు. ఈ కార్యక్రమాలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకు కొనసాగుతాయని తెలిపారు. సమత స్టేట్ కన్వీనర్ నిర్మల మహిళలో శాస్త్రీయ దృక్పథం పెంపు ఆవశ్యకతపై మాట్లాడారు. సభకు ముందుగా వైస్ ఛాన్సలర్ మోహంతీ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సతీష్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఎండిన వరిచేలను చూపిస్తున్న సిపిఎం నాయకులు , రైతులు



మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కరువు జిల్లాగా ప్రకటించాలి

- ప్రభుత్వ వైఫల్యమే పంట నష్టానికి కారణం
- ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం చెల్లించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- ఎండిన వరిచేలు పరిశీలన
- మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరం జిల్లా కరువుకోరల్లో చిక్కుకున్నందున కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఎం జిల్లాకార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వెంకటరమణ పేట గ్రామ పొలాల్లో నీరు లేక ఎండిపోయిన వరిచేలను సిపిఎం నాయకులు గాడు అప్పారావు, మద్దిల రమణ తదితరులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట పెట్టుబడులు,సాగునీటి సమస్యలపై తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కలిసి మెడకు ఉరితాళ్లు వేసుకొని పొలాల్లో నిరసన తెలిపారు.అనంతరం తమ్మినేని మాట్లాడుతూ. ప్రభుత్వం, రెవెన్యూ యంత్రాంగం, వ్యవసాయశాఖ మొదలగు అధికార యంత్రాంగ వైఫల్యమే పంట నష్టాలకు కారణమని అన్నారు. వర్షాధారం మీద పండే వాటిని ఏమీ చేయలేమని, వర్షాలు ఉండి, కాలువలు ఉండి నీరందలేని పరిస్థితి ఈ జిల్లాలో నెలకొందని అన్నారు. సిపిఎం నాయకుల బృందం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటిస్తోందని, కొత్తవలస, ఎల్. కోట, వేపాడ మండలాల్లో 80 నుండి 90శాతం వరకు పంటలు ఎండిపోగా ఎస్.కోట మండలంలో 60 నుంచి 70శాతం నష్టం సంభవించిందని అన్నారు. అధికారులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం దుర్మార్గమని అన్నారు. సిపిఎం బందం రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేసి 303 కరువు మండలాలను గుర్తించగా రాష్ట్ర ప్రభుత్వం 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఇందులో విజయనగరం జిల్లాకు సంబంధించి ఒక్క మండలం కూడా లేకపోవడం అన్యాయమని అన్నారు. రైతు ఒక ఎకరాకు సుమారు రూ.25వేలు నుంచి 30 వేలు పెట్టుబడి పెట్టారని, రైతు కష్టంతో కలిపి పంట నష్టానికి ఒక్కొక్క ఎకరానికి రూ.50వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోవడానికి మరో కారణం చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికావడమేనని, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల వైఖరివల్లే ఈ పరిస్థితి నెలకొందని అన్నారు. పంటలు పండేందుకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపించకపోగా ఉన్న వాటిని కబ్జాలు చేస్తున్నారని అన్నారు.

జిల్లాలో 4 లక్షల 75 వేల ఎకరాలలో వరి నాట్లు వేయాల్సి ఉండగా 4 లక్షల ఎకరాల్లో మాత్రమే పంట వేశారని. దీంట్లో 60 నుంచి 70శాతం వరకు జిల్లాలో పంట నష్టం సంభవించిందని. కాబట్టి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో రైతాంగాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వెంకట రమణ పేట రైతులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు...అండగా ఉంటాం

- రైతులకు కలెక్టర్ నాగలక్ష్మి భరోసా
- 2,63,394 మందికి రూ.108.42 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-గజపతినగరం

వర్షాభావ పరిస్థితులను చూసి రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి భరోసా ఇచ్చారు. పంట పోయిన చోట ఇన్‌పుట్ సబ్సిడీ లేదా బీమా పరిహారాన్ని ఇప్పించడానికి కృషి చేస్తామని అన్నారు. గజపతినగరం మార్కెట్‌యార్డులో మంగళవారం జరిగిన రైతు భరోసా-పిఎం కిసాన్ విడుదల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలోని సుమారు 2,63,394 మంది రైతులకు, రూ.108.42 కోట్ల రైతు భరోసా చెక్కును అందజేశారు. పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ పథకం కింద రాష్ట్రంలోని రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నగదు విడుదల చేశారు. బటన్ నొక్కి ఒక్కో రైతు ఖాతాలో రూ.4వేలు చొప్పున జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, కొన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులపై ప్రతీరోజూ సమీక్ష నిర్వహిస్తున్నామని, ఎండిపోయిన పంటల వివరాలను రోజువారీగా తెలుసు కుంటున్నామని చెప్పారు. ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామని, రైతులు ఈ కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి, తమ పంటల వివరాలను తెలియజేయవచ్చునని సూచించారు. వరి పంటను గ్రామ యూనిట్‌గా దిగుబడి లెక్కిస్తామన్నారు. రైతు సమస్యలను గుర్తించేందుకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని ఆదేశించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ, రైతుకు అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. గత నాలుగేళ్లతో పోలిస్తే, ఈ ఏడాది వర్షపాతం కొంత తగ్గిందని, అయినప్పటికీ రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటినంతా వ్యవసాయానికి మళ్లిస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ, డ్రోన్స్ ద్వారా ఎరువులు, పురుగు మందులు జల్లేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఎంఎల్‌ఎ తెలిపారు. డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు గార తవుడు మాట్లాడుతూ, చాలా చోట్ల వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, తమ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమల ముత్యాలరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.టి.రామారావు మాట్లాడారు. వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్‌ను ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా పరీక్షించి రైతులకు చూపించారు. జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశు సంవర్ధకశాఖ, డిసిసిబి అధికారులు, ఎడిఎలు మహారాజన్, అన్నపూర్ణ, ఎఒలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతు భరోసా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 15న విజయవాడలో జరుగు ప్రజారక్షణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బాబామెట్టలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 45 వార్డు కనపాకలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ, నాయకులు బి.రమణ అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి శంకరరావు మాట్లాడుతూ విభజన హామీల అమలు చేయకుండా, ఎపి రావాల్సిన నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా వైసిపి, టిడిపి,జనసేన ప్రశ్నించకుండా బిజెపికి కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ప్రజారక్షణభేరిని సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిందని తెలిపారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టీచర్ల బదిలీల్లో భారీ అవినీతి

మంత్రి బొత్స సమాధానం చెప్పాలి
టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీల్లో భారీ అవినీతి జరుగుతోందని టిడిపి విజయనగరం పార్లమెంట్ స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్ల బదిలీల కోసం గతంలో రాజకీయ నాయకుల చుట్టూ తిప్పుకునే సంస్కృతి ఉండేదని, ఈ ప్రక్రియకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో చంద్రబాబునాయుడు కౌన్సిలింగ్ విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో నిజాయతీగా బదిలీ ప్రక్రియ జరుగుతుండేం దన్నారు. ఇప్పుడు బొత్స విద్యాశాఖ మంత్రి అయిన తరువాత ఈ సిస్టమ్‌ను మార్చేసి అవినీతి చేస్తున్నారని ఆరోపించారు. వారికి కావాల్సిన మనుషులకు నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేస్తున్నారని మండిపడ్డారు. బదిలీలు కోసం రూ.2లక్షలు నుంచి రూ.5లక్షలు వరకు డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మంత్రి బొత్స విద్యాశాఖను అవినీతి మయం చేస్తున్నారని విమర్శించారు. అనేక ఆరోపణలు వస్తున్నా వాటిపై బొత్స ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. విద్యా కానుక కిట్‌లలో కూడా భారీ అవినీతి జరుగుతోందన్నారు. అవసరం లేకున్నా అదనంగా లక్షా 70 వేల కిట్‌లు ఎందుకు కొన్నారన్నారు. విద్యా కానుక కిట్‌లు బాగోలేవని చెప్పినా కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. మధ్యాహ్నం భోజనం పథకంలో ఇచ్చే చెక్కీలు కూడా టెండర్ లేకుండా పాత కాంట్రాక్టర్‌ను ఎందుకు కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ ప్రశ్నలన్నింటికీ బొత్స సమాధానం చెప్పాలన్నారు.

సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, నాయకులు గంటా పోలి నాయుడు, కర్రోతు నర్సింగరావు, శ్రీనివాసరావు, కంది మురళి నాయుడు, కనకల మురళీ మోహన్ పాల్గొన్నారు.

బిసిలకు పూర్వ వైభవం తీసుకొద్దాం

మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి-విజయనగరంకోట

బిసిలకు పూర్వ వైభవం తీసుకు వద్దామని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. బిసిలకు అన్యాయం చేస్తున్న జగన్‌పై ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. మంగళవారం ఓ ప్రైవేటు హోటల్‌లో 'జగన్ పాలనలో బిసిలపై దాడులు- ప్రభుత్వ వైఫల్యం'పై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సత్యనారాయణమూర్తి, రామారావు మాట్లాడారు. టిడిపి తొలి నుంచి బిసిలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైసిపి చేపట్టిన సాధికార బస్సుయాత్రలో బిసిలకు ఏం చేశారో చెప్పలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్ర బిసి నాయకులపై సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. బిసి కులాలకు దగా చేసిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు కులగణన చేపడుతున్నారని అన్నారు. కులాల వారిగా కార్పొరేషన్లు పెట్టినా వాటికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో బ్యాక్ లాగ్ పోస్టుల గురించి ఊసే లేదన్నారు. లోక్‌సత్తా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ కులాల పునాదులపై వ్యవస్థలను నిర్మించలేమని అంబేద్కర్ ఏనాడో చెప్పారన్నారు సమాజాభివృద్ధి కోసం రాజకీయంగా, సామాజికంగా బలపడ్డానికి చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ బిసిల కష్టాలు పోవాలంటే ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, పార్లమెంటరీ అధ్యక్షులు నారాయణ, లోక్‌సత్తా నాయకులు గురాన అయ్యలు, మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, రొంగలి రామారావు, బిజెపి నాయకులు బొబ్బిలి శ్రీను, సిపిఐ నుంచి అప్పారావు బిసి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బిసి నాయకులు



పెద్దచెరువులో నిర్వహిస్తున్న తెప్పోత్సవం

ఘనంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం పెద్ద చెరువులో ఘనంగా జరిగింది. వేద పండితులు, ఆలయ పూజారి వెంకటరావు ఆధ్వర్యంలో వనం గుడి నుంచి అమ్మవారిని సున్నపు వీధి గుండా పెద్ద చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని విద్యుత్ వెలుగులతో నిండిన తెప్పలో ఉంచి మూడు సార్లు అమ్మవారిని తూర్పుకు, పడమరకు చెరువులో ఊరేగించారు. ప్రజలంతా పెద్ద చెరువు గట్టు నుంచి తెప్పోత్సవాన్ని వీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రావణి, ఆర్‌డిఒ సూర్యకళ, పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఎసి సుధారాణి, ఆలయ ఉద్యోగులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ పథకాలపై అసిస్టెంట్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి-విజయనగరం

డిఆర్‌డిఎ ద్వారా అమలు జరుగుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదీప్ వెంకట్ త్రివినాగ్ ఆరా తీశారు. డిఆర్‌డిఎ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. వైయస్ఆర్ పింఛను కానుక, సంస్థాగత నిర్మాణం, వైయస్ఆర్ చేయూత, వైయస్ఆర్ ఆసరా, మహిళా మార్టులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, లైవ్ స్టాక్, బ్యాంకు లింకేజి, వైఎస్ఆర్ సున్నావడ్డీ, జగనన్నతోడు, స్త్రీనిధి, ఉన్నతి మొదలగువాటి గురించి చర్చించారు. సమావేశంలో ప్రాజెక్ట్ డైరక్టర్ ఎ. కళ్యాణ చక్రవర్తి, ఎపిడి సావిత్రి, పాల్గొన్నారు.

సైకో పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో సైకో పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు బొబ్బిలిలో బేబినాయన ప్రారంభించిన అన్న క్యాంటీన్ కు 500 రోజులు పూర్తి కావడంతో కోటలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో పాలనలో రాజ్యాంగ హక్కులపై దాడి జరుగుతుందన్నారు. సైకో పాలనలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకునేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు గతంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ అన్న క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం మూసివేయడం పేదల కడుపు కొట్టడమేనన్నారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి టిడిపి పెద్దపీట వేసి అన్న క్యాంటీన్లు పెట్టి పేదలకు అన్నం పెడితే వైసిపి ప్రభుత్వం మూసివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదల ఆకలి తీరుస్తున్న బేబినాయనకు కతజ్ఞతలు చెప్పారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత వరకు అన్న క్యాంటీన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌కు 500 రోజులైన సందర్భంగా బెలూన్లు ఎగురవేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



అలరించిన నృత్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అభినయ ప్రియ నర్తన శాల ఆధ్వర్యాన అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రాంగణంలో మంగళవారం రాత్రి ప్రదర్శించిన నృత్య రూపకాలు అలరించాయి. వినాయక విఘ్నేశ్వర అంటూ ఓ చిన్నారి చేసిన సోలో నృత్యానికి సభికుల హర్ష ధ్వానాలు వ్యక్తమయ్యాయి. నర్తనశాల నిర్వాహకులు సాయి సుప్రియ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సులోచన మాట్లాడుతూ సాయి సుప్రియ కేవలం నత్యం లోనే కాకుండా నాటికలు, సినిమాల్లో కూడా నటిస్తూ విజయనగరానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారని కొనియాడారు. సుప్రియ మాట్లాడుతూ ఎలాంటి రుసుమూ తీసుకోకుండా చిన్నారులకు నృత్యం నేర్పుతున్న ట్లు తెలిపారు.

సచివాలయాల్లో డిస్‌ప్లే బోర్డులు పెట్టాలి

అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 9 తేదీ నుండి ప్రతి సచివాలయం లో ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను అమర్చాలని కార్యదర్శులకు సహాయ కమిషనర్ ప్రసాదరావు ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సచివాలయ అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు, ఏయే పథకాలలో ఎంత మొత్తంలో పొందారు అనే వివరాలతో కూడిన డిజిటల్ బోర్డులను అమర్చే కార్యక్రమాన్ని ఈనెల 9 నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, జోనల్ ఇంఛార్జులు పాల్గొంటారని చెప్పారు. ఇందుకోసం ప్రతి సచివాలయానికి ప్రత్యేక అధికారిని నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఒ మూర్తి, టి పిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

బిజెపి జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి ప్రభుత్వం మద్యం పాలసీపై శ్వేత పత్రం విడుదల చేయమన్నందుకు వైసిపి నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురందీశ్వరి అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సజ్జల, విజయసాయిరెడ్డి, అంబటి స్థాయిని మరచి అవమానకరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాసిరకం మద్యం అమ్ముతూ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటోందని అన్నారు. లక్ష రూపాయల అమ్మకాల గాను రూ.700మాత్రమే బిల్లులు చూపిస్తున్నారని అన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఈనెల 21న పురందీశ్వరి జిల్లాకు రానున్నారని, ఆరోజున ఆనంద గజపతి ఆడిటోరియంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా ఇన్చార్జి రామరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, జిల్లా మాజీ అధ్యక్షులు శివప్రసాద్ పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి, ప్రధానకార్యదర్శి రవిరాజు, జిల్లా అధ్యక్షులు పాలవలస సింహాచలం, పార్టీ జిల్లా అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు నెల్లిమర్ల నియోజకవర్గం లో ఉన్న తారకరామ తీర్ధ సాగర ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. అనంతరం నీరులేక ఎండిపోయిన వరి చేలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

నవజాత శిశువులను సంరక్షించండి

విజయనగరం టౌన్ : నవజాత శిశువులను సంరక్షించాలని, వారిపట్ల తల్లి దండ్రులు ఆరోగ్య సిబ్బంది జాగ్రత్త వహించాలని న్యాయమూర్తి బి.రమ్య అన్నారు. నవజాత శిశువుల ఆరోగ్యంపై డాక్టర్లు సూచించిన జాగ్రత్తలను పాటించాలని అన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అచ్యుత కుమారి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం శిశుమరణాలు వెయ్యికి 70మంది మరణిస్తున్నారని, దీన్ని 10కి తగ్గించడానికి ఆరోగ్యశాఖ కృషి చేస్తుందని అన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని విజయనగరం 1వ పట్టణ, 2వ పట్టణ, బొబ్బిలి, నెల్లిమర్ల పోలీసు స్టేషన్ల పరిధిలో నివసిస్తూ పండగలకు, పుణ్య క్షేత్రాలకు, సొంత పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలంతా తమ ఇళ్లలో ఎటువంటి దొంగతనాలూ జరగకుండా ఉండేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్. సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి ఎం.దీపిక కోరారు. దొంగతనాల నివారణకు పోలీసుశాఖ లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టంను ప్రత్యేకంగా రూపొందించి, భద్రతను మరింత పటిష్ఠం చేసిందన్నారు. ఈ విధానం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన అవసరాల నిమిత్తం ఇల్లు విడిచిపెట్టి బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు దొంగతనాలు జరుగుతున్నా యన్నారు. తాము ఇల్లు విడిచి బయటకు వెళ్తున్నట్లు సంబంధిత పోలీసు స్టేషనుకు ముందస్తు సమాచారాన్ని అందిస్తే స్థానిక పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారన్నారు. ఏదైనా అవసరం లేదా ప్రత్యేక పని మీద తమ ఇంటిని విడిచిపెట్టి వెళ్లే ప్రజలు ముందుగా సంబంధిత పోలీసు స్టేషనుకు సమాచారం ఇస్తే పోలీసు అధికారులు ఆ ఇంటిని సందర్శించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. ఇందుకు ఇంటి యజమాని తమ స్మార్ట్ ఫోనులో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌనులోడు చేసుకోవాలన్నారు. నిఘా కోసం ఏర్పాటు చేసిన సిసి కెమెరాలతో ఈ యాప్ అనుసంధానం చేయడం వలన దొంగతనాలను నివారించ వచ్చునన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇంటి పరిసరాలలోకి ప్రవేశించిన వెంటనే పోలీసులకు సమాచారం చేర వేస్తుందని, దీంతో అప్రమత్తమై, దొంగతనాలు జరగకుండా సులువుగా నియంత్రించ వచ్చునని ఎస్‌పి తెలిపారు. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అత్యాధునికమైన 50 ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలు అందుబాటులో ఉంచామన్నారు. దొంగతనాలను నివారించడానికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా ఎంపికై పోలీసు శిక్షణ కళాశాలలో విధులు నిర్వహిస్తూ, ఇటీవల మృతి చెందిన పి.సూర్య ప్రకాశరావు కుటుంబానికి హోంగార్డులు ఒక్కరోజు అలవెన్సు రూ.3.46లక్షలను ఎఎస్‌పి అస్మాఫర్హీన్ అందజేశారు. మంగళవారం ఆయన కుమారుడు పి.మణికంఠకు ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఆర్‌ఐ ఎన్.గోపాలనాయుడు, కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరగనున్న వాలీబాల్, తైక్వాండో, బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీడీలు, ప్రజా ప్రతినిధులు మంగళవారం అభినందించారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని దెందేరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విరోతు నవీన్, రాంచరణ్, గవర జయశ్రీ, యోగితాలు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకులో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్ 14 విభాగంలో పాల్గొంటారు. వీరిని హెచ్‌ఎం సునీత, పీడీ కె. కృష్ణరాజు, దెందేరు సర్పంచ్ వి.రమణ, గులివిందడ సర్పంచ్ గణేష్, పాఠశాల సిబ్బంది మంగళవారం అభినందించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారులు

బొబ్బిలి: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 9,10,11న కడప జిల్లా కోడూరులో జరగనున్న అండర్ 17, అండర్ 19 విభాగాల్లో తైక్వాండో పోటీలకు కె.అభినవ్, సోమేష్ యాదవ్, బి. రోహిత్, కిషోర్ కుమార్ ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అభినందించారు. పోటీలలో ప్రతిభ కనబరిచి బొబ్బిలికి మంచి పేరు తీసుకురావాలని బేబినాయన కోరారు.



బొబ్బిలి: క్రీడాకారులను అభినందిస్తున్న బేబినాయన

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు బాలురు, బాలికలు ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మంగళవారం తెలిపారు. ఈ విద్యార్థులు మండలంలోని వెంకటరమణపేటలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీల నుండి ఎంపిక అయ్యారన్నారు. అండర్ 14కు వెలగల సాగర్, రాడి గాయత్రి, అండర్ 17కు బురాడ యోగి, వీరవరపు కావ్యలు ఎంపికయ్యారని చెప్పారు. త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ బాస్కెట్ బాల్ పోటీలలో వీరు విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఉప ప్రదానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, రహీం షేక్ లాల్, పొట్నూరు శివాజీ, సతీష్, రాజేష్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంవిజిఆర్‌లో బాస్కెట్ బాల్ టోర్నమెంట్

డెంకాడ : ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఇంటర్ కాలేజియేట్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ కమ్ సౌత్ జోన్ ఇంటర్-యూనివర్శిటీ సెలక్షన్‌లను మంగళవారం నిర్వహించారు. టోర్నమెంట్‌లో 10 కళాశాలలు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌లో ఎంవిజిఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విజేతగా, శ్రీకాకుళం టెక్కలి ఐతమ్ కళాశాల రన్నర్స్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమానికి జెఎన్‌టియు పరిశీలకులు పిఎస్‌వి రమణ, ఎంపిక కమిటీ సభ్యులు బి. రామయ్య, సిహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

గుర్ల : వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్‌పి ఎం.దీపిక గుర్ల పోలీసు స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ ప్రాంగణం, ప్రాపర్టీ గది, రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేశారు. అనంతరం పోలీసు సిబ్బంది, ఎంఎస్‌పిలతో మమేకమై, వారి సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఎస్ చక్రవర్తి, సిఐ హెచ్. ఉపేంద్ర, ఎస్ఐ హరిబాబు నాయుడు, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంప్ ప్రారంభం

నెల్లిమర్ల: భారత్ స్కౌట్స్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రీజినల్ ట్రైనింగ్ క్యాంపింగ్ సెంటర్ మంగళవారం స్థానిక పూల్ బాగ్ వద్ద ప్రారంభమైంది. జిల్లా కార్యదర్శి వాక చిన్నంనాయుడు సమన్వయంతో దాసరి వేణుగోపాల్ నాయకత్వంలో రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపు ప్రారంభించినట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ ఈపు విజయకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్కౌట్ విద్యార్థులు గడిచిన మూడేళ్లుగా చేస్తున్న వివిధ రకాల విద్యా, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల వల్ల రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపులో పాల్గొనే అవకాశం మీకు లభించిందన్నారు. జిల్లా కార్యదర్శి వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ ఈ పరీక్షలు పూర్తి చేసినవారికి గవర్నర్ సంతకంతో సర్టిఫికెట్లు వస్తాయని అవి మీ ఉన్నత చదువులకు రిజర్వేషన్ కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఓసి వేమలి త్రినాథ్ నాయుడు, ఎస్ఓసి కమిలి దుర్గా నాగేశ్వరరావు, సోంపురం హెచ్ఎం బిబిఎ రాజు, ఆదిత్య స్కూల్ నెల్లిమర్ల హెచ్ డబ్ల్యుబి స్కౌట్ మాస్టర్ వివిఎస్ నారాయణ, అల్లా స్కూల్ స్కౌట్ మాస్టర్లు ఎం భాస్కర్ రావు, వి.నరసింహ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

నెల్లిమర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పై అవగాహన కల్పించాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల పై వార్డు, సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ పథకాల అమలులో నవంబర్ 9వ తేదీ నుండి అన్ని సచివాలయాల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఆయా సచివాలయాల్లో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డులు, లబ్ధిదారులకు చేరినవి, పరిష్కారం లబ్ధిదారులకు చేరినవి వివరాలు, సంక్షేమ క్యాలెండర్లు ప్రదర్శించాలని సూచించారు. అవగాహన సదస్సు నిర్వహించబోయే ముందుగానే ఇంటింటికి వెళ్లి వాలంటీర్ల ద్వారా అవగాహన కల్పించి సదస్సులకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, ఆర్ఐ రాజ్య లక్ష్మి, మెప్మా సిఎంఎం డి.గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదు పై పరిశీలన

వేపాడ: మండలంలోని వావిలపాడు గొల్లవీధిలో సిసి రోడ్డుకు ఇరువైపులా నిర్మించి కాలువ పనుల్లో అవకతవకలు జరిగాయని జిల్లా కలెక్టర్ స్పందన విభాగంలో శ్రీను అనే వ్యక్తి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు మంగళవారం గ్రామంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. కాలువకు ఇరువైపులా నివసిస్తున్న వారిని కాలువ నిర్మాణం వల్ల కలిగే నష్టం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పరిశీకాన రమణమ్మ, నూనెల మహాలక్ష్మమ్మ, రోమాల సన్యాసమ్మ, దేవుడమ్మ, గోవిందమ్మ, గండి శ్రీను మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా బీల రాజేశ్వరి సర్పంచ్‌గా పని చేస్తున్నారని గ్రామాన్ని చాలా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కాలువ నిర్మాణం వల్ల 35 సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని చెప్పారు. కాలువలో ఎటువంటి అవకతవకలూ జరగలేదన్నారు. ఎవరో సర్పంచ్‌పై బురద జల్లడానికి ఇటువంటి ఫిర్యాదు చేశారని కొట్టిపారేశారు. అనంతరం డిఇ పైడిరాజు మాట్లాడుతూ మీకు ఏదైనా సమస్య ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ పరిశీలనలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, ఫిర్యాదుదారుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న డిఇ పైడిరాజు

పాటూరు పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఇఓ-2 బాలభాస్కరరావు పరిశీలించారు. తరగతుల సామర్థ్యాలను, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, పాఠశాలకు సంబంధించిన ప్రధాన రికార్డులను, ఉపాధ్యాయుల స్కూల్ డైరీలను, లెసన్ ప్లాన్లను, జగనన్న గోరుముద్దను, టాయిలెట్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

పంట కోత ప్రయోగాలు

వేపాడ: మండలంలోని బానాదిలో చెల్లాడ సతీష్ ఎకరా పొలంలో, బల్లంకిలో పల్ల దేవుడు పొలంలో పంట కోత ప్రయోగాలు చేసినట్లు ఎఎస్ఒ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో బానాది గ్రామ సచివాలయం వ్యవసాయ అధికారి నాయుడు రైతులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విజయనగరం: జిల్లాలో పలువురు వికలాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త బి.లింగేశ్వరరెడ్డి ఎస్ఎస్ఎ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వికలాంగ విద్యార్థులకు డిజిటల్ సాధనాల ద్వారా విద్యను సులభతరం చేసేందుకు ట్యాబులను అందిస్తున్నామన్నారు. ఈ ట్యాబులో వినికిడి, దృష్టి లోపాలు గల విద్యార్థులకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్, పలు యాప్‌లను ఇందులో పొందుపరచడం జరిగిందన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా 106 మంది వినికిడి వైకల్యం వారికి, 20 మంది దృష్టి లోపం వారికి, 83 మంది ప్రత్యేక ఉపాధ్యాయులకు ట్యాబులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్యాబులు వినియోగించే పై రిసోర్స్ పర్సన్లు కె. ఈశ్వరరావు, సునీల్ స్పెషల్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఫైనాన్షియల్ అధికారిణి వి. కృష్ణవేణి, సహిత విద్య సహ కోఆర్డినేటర్ ఎం.శ్యాంతి, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో 'స్వీప్'

ప్రజాశక్తి- డెంకాడ

చింతలవలసలోని ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) 2023 కార్యక్రమాన్ని తహశీల్దార్ ఆదిలక్ష్మి డిటి క్రాంతి నిర్వహించారు. స్వీప్ యాప్ ద్వారా అర్హులైన విద్యార్థులందరికీ ఎలక్టోరల్ ఎన్‌రోల్‌మెంట్ చేయడానికి, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఎన్నికల ప్రక్రియను తెలుసుకుని ఓటరుగా నమోదు చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. యువత ఎన్నికల ప్రక్రియపై సరైన అవగాహన కలిగి ఉండి, తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో చురుకుగా పాల్గొనాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ క్రాంతి వివిధ ఫారంలు, ఎన్నికల నమోదు ప్రక్రియలో వాటి ఉపయోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎస్.మోహన్ కుమార్, వి.ఆర్.ఒ శ్రీనివాసరావు, పోలీస్ వై. సుభాషిణితో పాటు ఎంవిజిఆర్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థి సమన్వయ కమిటీ సభ్యుడు బి. హరి కుమార్ పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ఓటు హక్కు పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆయన వివిధ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో స్వీప్ ఆక్టివిటీస్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎవరు కూడా ఓటర్ జాబితా బయట ఉండరాదని సూచించారు. ఓటరు అవగాహన నిమిత్తం ఇటీవలనే తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిగ్నేచర్ వాల్ పై వివిధ కళాశాలల నుంచి వచ్చిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు సంతకం చేశారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వివిధ కళాశాల నుంచి వచ్చిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సూపర్వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - వంగర

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొత్స సుధారాణి అన్నారు. ఈ మేరకు వంగరలో ఆశా వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పని ఒత్తిడి తగ్గించి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన ఆశ వర్కర్ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, కేంద్ర బడ్జెట్లో వైద్య రంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పోరెడ్డి విశ్వనాథం, పలు గ్రామాలకు చెందిన ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ఆశా వర్కర్లకు కనీసవేతనం అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు కోరారు. మంగళవారం పిరిడి పిహెచ్‌సి వద్ద ఆయన ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల పని చేసిన ఎమ్మెల్యే, ఎంపీలకు పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆశా వర్కర్లకు పెన్షన్, గాడ్యూటీ సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో మహాధర్నా, డిసెంబర్ 11, 12 తేదీల్లో కలెక్టర్ ఆఫీస్ వద్ద 36 గంటల ధర్నా చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు రాధ, రవణమ్మ, ఎల్లమ్మ, నారాయణమ్మ, పాల్గొన్నారు.



జామి: సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

జామి: విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 20 అంశాలపై ఇటీవల సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి యాత్ర డిమాండ్లను వెల్లడించారు. మహా దర్నాలో అందరూ పాల్గొవాలన్నారు.

జెఎస్ శిబిరం పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక పురపాలక సంఘం పరిధిలో గల 10వ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంటకచినప్పల నాయుడు మంగళవారం సందర్శించారు. అక్కడ వైద్యులతో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలును పరిశీలించారు. ప్రజల ఆరోగ్య సమస్యలు తీర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇందులో ఏడు రకాల సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచిత వైద్య పరీక్షలతో పాటు వైద్యం కూడా ఉచితంగా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ ఛైర్మన్ చెలికాని మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, వార్డు ఇంచార్జ్ సుంకరపల్లి వాసంతి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. మండలంలో పెదనాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ప్రతి ఇంట్లో ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్యం అందిస్తున్నామన్నారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటే మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపిస్తున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి బమ్మిడి అప్పలనాయుడు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ రమేష్, ఐసిడిఎస్ పిఒ నాగమణి, సర్పంచ్ గొటివాడ దాసు, దాసరి పేట సర్పంచ్ పొడిపి రెడ్డి సత్యం, ఎంపిటిసి కన్నయ్య, పలువురు వైద్యాధికారులు, సచివాలయ, అంగన్వాడి, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

14న స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- రామభద్రపురం

డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంతి మాసోత్సవాలు ముగింపు సందర్భంగా ఈ నెల14న మండల పరిధిలోని భూశాయవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బొబ్బిలి బ్లడ్ బాంక్, శ్రీ బాపూజీ గ్రామీణాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపి అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పాల్గొని అర్హులైన ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి విజయవంతం చేయాలని అన్నారు. గత నెల 15 నఅబ్దుల్ కలాం జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం జాతీయ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించినందున ఆరోజు నుండి నవంబర్ 14 జాతీయ బాలల దినోత్సవం వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరోజున ముగింపు సందర్భంగా భూశాయవలసలో అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ చేపడతామన్నారు. సివిల్స్ గ్రూప్స్‌లో విజేతలైన మడక కృష్ణమూర్తి, కెల్ల ఉదయపావని, గోపిశెట్టి మనోహర్‌లకు అభినందన, మండల స్థాయిలో ప్రతిభ చూపిన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, 2023 కలాం ఫౌండేషన్ యంగ్ కలాం అవార్డుల ప్రదానం, కలాం సామాజిక సేవా అవార్డ్ గ్రహీతలకు సత్కారం చేస్తామన్నారు. కేన్సర్ పై అవగాహన, బాల్య వివాహాలు నిరోధానికి చర్యలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టవలసిన కార్యక్రమాలు, గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై అవగాహన కల్పిస్తూ పెద్దల ఉపాన్యాసాలతో పాటు జిల్లాకు ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రి అవసరం, గ్రామాల్లో ప్రాథమిక వైద్యం కోసం గ్రామీణ వైద్యుల ఆవశ్యకతపై చర్చ ఉంటుందని తెలిపారు. మండలంలో గల అన్ని గ్రామాల ప్రజలు, వాలంటీర్లు,ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నైపుణ్య కోర్సులు భేష్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో అమలు చేస్తొన్న నైపుణ్య కోర్సులు చాలా బాగున్నాయని హెచ్‌పిసిఎల్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ వివి కృష్ణంరాజు కితాబునిచ్చారు. మంగళవారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అమలు చేస్తొన్న కోర్సులు, మౌలిక సదుపాయాలు పరిశీలించారు. అనంతరం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు ఆయనకు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డీన్ డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- భోగాపురం

పేదలకు పథకాలు అందించమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవల్లి సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ ఉప్పాడ విజయ భాస్కర్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడును గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తాతయ్యలు, ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ చింతాడ బంగారాజు, నాయకులు పడాల శ్రీనివాసరావు, భాను, సుందర హరీష్, వాసుపల్లి రెయ్యుడు, కర్రోతు వెంకటరమణ, ఏ పైడి నాయుడు, పూసర్ల వెంకటరమణ పాల్గొన్నారు.

బాడంగి: ప్రజలు ఎదురుకొంటున్న సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు అన్నారు.



భోగాపురం: బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

మండలంలోని గజరాయనివలసలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఈ ప్రభుత్వం అందిస్తుందన్నారు. తాగు నీటి కోసం ప్రత్యక చర్యలు తీసికోవాలని అధికారులకు సూచించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయం సిబ్బంది తగు చర్యలు తీసికోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, బి వెంకట్ నాయుడు, తెంటు మధు, మరిపి శంకర్, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిడిఒ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'జగనే ఎందుకు కావాలి' విజయవంతం చేయండి

ప్రజాశక్తి- బొండపల్లి

ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి చల్ల చలంనాయుడు, వైసిపి అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు కోరారు. మంగళవారం స్థానిక వనమిత్ర వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నాయకత్వంలో బొండపల్లి మండలంలో ఈనెల 9 నుంచి డిసెంబర్ 10 వరకు నెలరోజు లు పాటు ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి? అనే కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ప్రతి రోజు మధ్యా హ్నం 3గంటల నుండి 5 గంటల మధ్యలో అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొం టారని తెలిపారు. అదే రోజు సాయత్రం 5 నుండి 7 గంటల మధ్యలో వైసిపి పార్టీకి సంబంధించి నాయకుల బృందం గ్రామంలో పార్టీ పరిస్థితులపై అధ్యయనం చేస్తుందన్నారు సమావేశంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ రావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మండల పార్టీ అధ్యక్షులు అప్పికొండ లక్షుంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు కోరారు. పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించి ఈ నాలుగన్నర ఏళ్లలో జగనన్న చేసిన అభివృద్ధిని వివరిస్తారని తెలిపారు. సమావేశంలో నాయకులు చింతల సింహాచలం నాయుడు, పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలో ఈనెల 9 నుంచి జరగనున్న ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమంలో అన్ని శాఖల సిబ్బంది వాలంటీర్లు విధిగా పాల్గొనాలన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అధికారులంతా పాల్గొంటారని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఎంఎస్ ఎన్ కాలనీ 37, 38వ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమానికి విశేషస్పందన లభించింది. జొన్న గుడ్డి, సాయినాథ్ కాలనీ ప్రాంతాల ప్రజలు చేరుకొని వైద్య సేవలను పొందారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి రిఫరల్ చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పై మహిళలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేశారు. బాలామతంతో చేసిన పదార్థాలను ప్రదర్శించారు. స్థానిక కార్పొరేటర్లు పాల్గొని ప్రజలను చైతన్యపరిచారు.

కెవికె వద్దని నిరసన



నిరసన ర్యాలీ చేస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని చిన్న చామలపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న కొండ వద్ద కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణాన్ని ఆ గ్రామానికి చెందిన యాదవులు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయమై గ్రామస్తులతో మాట్లాడు తామని ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని ఆర్‌డిఒ మంగళవారం స్థానిక విఆర్ఒ ద్వారా కబురు పంపారు. ఆ కొండను సాగు చేసుకుంటున్న పేద రైతులతో పాటు, ఆ కొండపై బతుకుతున్న యాదవులు కూడా ఆర్‌డిఒ వస్తారని, తమ సమస్య చెప్పుకుందామని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎదురు చూశారు. ఆర్‌డిఒ రాకపోవడంతో తమ ప్రాణాలు పోయిన ఆ భూమిని కృషి విజ్ఞాన కేంద్రానికి ఇవ్వబోమని నిరసన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాకోటి రాములు మాట్లాడుతూ ఈ గ్రామానికి చెందిన యాదవులకు చెందిన జీవాలకు ఈ కొండ ప్రధాన జీవనాధారమన్నారు. ప్రత్యామ్నాయ మార్గం చూడకుండా ఇక్కడే ఈ కేంద్రం నిర్మిస్తామని అనడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి కృషి విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మన్యాల ఎరుకునాయుడు, సర్పంచ్ శ్రీను, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సర్పంచ్ ప్రమేయం లేకుండానే తరలింపు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరులో సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి ప్రమేయం లేకుండానే గ్రామ సచివాలయ భవనాన్ని తరలించడంపై ఆమె తప్పు పట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నడుస్తున్న సచివాలయాన్ని నూతనంగా నిర్మించిన సచివాలయంలోకి జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సామగ్రిని, సిబ్బందిని తరలించారు. సచివాలయం తరలింపు విషయాన్ని సర్పంచ్‌కు చెప్పకపోవడంతో ఆమె మండిపడుతున్నారు. ఎదురు అమావాస్య కారణంగా కొద్ది రోజులు తరువాత కొత్త భవనంలోకి మారుదామని చెప్పినా ఎంపిడిఒ అత్యుత్సాహంతో తనకు సమాచారం కూడా ఇవ్వకుండా కొత్త భవనం లోకి తరలించడం సిగ్గుచేటన్నారు. టిడిపి వర్గానికి చెందిన తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ, అధికార పార్టీ నాయకులకు బానిసలుగా పనిచేయడం సిగ్గు చేటన్నారు. గ్రామ ప్రథమ పౌరురాలకు సమాచారం ఇవ్వకుండా చులకన చేయడంపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆమె వెల్లడించారు.